తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
సోమవారం
08 జూన్ 2026
పేజీలు : 8
Follow :





### కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రధాన రహదారిపై
## విచ్చలవిడిగా చెట్లకొమ్మలు

**గడుపు దూమారంతో రోడ్లపైకి వచ్చి వాహనదారులకు ఇబ్బందులు..**

**డ్రైనేజీలో చెత్తపడి దుర్వాసన వెదజల్లుతుందని గ్రామస్తులు ఆవేదన..**

**చిగురుమామిడి జూన్07 (జనంసాక్షి):** మండలంలోని సుందరగిరి గ్రామం నుండి హుస్నాబాద్ వరకు జరుగుతున్న నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులలో భాగంగా గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను నరికివేసి చెట్ల కొమ్మలను సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా పడవేశారని వాహనదారులు,గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఆర్ అండ్ బి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చెట్లు కొట్టి కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా చెత్తను అలాగే పడి వేసి చోద్యం చూస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో భారీ గాడ్పు దుమారాలకు చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వచ్చి వాహనదారులకు ప్రమాదకరంగా మారాయని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చెట్లు కొట్టిన చెత్తతో డ్రైనేజీలు స్తంభించిపోయి దుర్వాసన వెదజల్లుతుందని,దీంతో దోమలు వ్యాప్తిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.గ్రామంలో ఇండ్ల ముందు ఉన్న చెత్త చెదారాన్ని వెంటనే తొలగించేలా ఆర్ అండ్ బి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

### వీణవంక 3.అక్రమంగా తరలించి నిల్వ ఉంచిన వంద ట్రాక్టర్ల ఇసుక కుప్పలు సీజ్: ఎస్ఐ ఆవుల తిరుపతి

వీణవంక జూన్ 7 (జనంసాక్షి)

వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని గొల్లపల్లి కేశవేని వెంకటేష్,ఆషాఢపు వినయ్,జీల పరశురాములు జీల అనిల్,గెల్లు శంకర్ లకు చెందిన ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వంచిన ఇసుకను సీజ్ చేసినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి ఆదివారం తెలిపారు.ఇదిలా ఉండగా మానేరు వాగు రోడ్డు వైపు అక్రమంగా నిల్వ ఉన్న ఇసుక నిల్వలను గుర్తించినట్లు ఆయన తెలిపారు.ఇసుకను అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.





### ఘనంగా పెద్దమ్మ తల్లీ బోనాల పండగ

**కథలాపూర్, జూన్ 7(జనంసాక్షి)**

కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో ఆదివారం రోజున ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయ ప్రత్యేక ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. సాయంత్రం ఇంటికొక్క బోనం చొప్పున మహిళలు నెత్తిమీద బోనమెత్తుకుని డప్పు చప్పుళ్ళ మధ్య, పోతారాజుల విన్యాసాలతో ఊరేగింపుగా పెద్దమ్మ తల్లి గుడికి తరలివెళ్లారు. పెద్దమ్మ తల్లి కి బోనాలు సమర్పించుకున్నారు. పెద్దమ్మ తల్లి దీవెనలు అందరిపై ఉండాలని. ప్రజలంతా సుభిక్షంగా వుండి పాడిపంటలతో, సుఖసంతోషాలతో ఉండాలన్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గ్రామ సర్పమ్మదం రవి,మరియు ఉప సర్పంచ్,ముదిరాజ్ సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వీణవంక క్రికెట్ జట్టు విజేతలకు బహుమతులు అందజేత

**వీణవంక జూన్ 7 (జనం సాక్షి)**

వీణవంక మండల కేంద్రంలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్లో విజేతలకు ఆదివారం ప్రజాప్రతినిధులు, అధికారులు బహుమతులు అందజేశారు. వీణవంక మండల కేంద్రానికి చెందిన శివాజీ యూత్,8వ వార్డు మెంబర్ బోగం అనిల్ ఆధ్వర్యంలో ఇటీవల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కాగా ఆదివారం శంకరపట్నం మండలంలోని కన్నాపూర్, వీణవంక జట్లు పోటీ పడగా కన్నాపూర్ క్రికెట్ జట్టు విజేతగా నిలువగా,వీణవంక క్రికెట్ జట్టు రన్నర్ గెలుచుకుంది. విజేతలకు ట్రోఫీతో పాటు రూ.15 వేల నగదు,రన్నర్ కు ట్రోఫీతో పాటు రూ.10 వేల నగదును ముఖ్య అతిథి స్థానిక ఎస్ఐ ఆవుల తిరుపతి మాజీ వైస్ఎంపీపీ రాయిశెట్టి లత,సీటీఓ వోరెం విజయ్,మాజీ ఉపసర్పంచ్ వోరెం భాను చందర్,శివాజీ యూత్ అధ్యక్షుడు గుర్రం రంజిత్,వార్డు సభ్యులు నీల శ్రీకాంత్,స్థానిక నాయకులు, యూత్, క్రీడాకారులు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువతను ఉద్దేశించి యువత క్రీడల పట్ల ఆసక్తిని




పెంచుకోవాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని యువకులు మత్తుపదార్థాలు బెట్టింగులు సెల్ ఫోన్ లకు అలవాటు పడకుండా ఏదో క్రీడను ఎంచుకొని అందులో వారి వారి నైపుణ్యాన్ని ప్రదర్శించి గ్రామ ఖ్యాతిని నిలుపుకోవాలని వారన్నారు.

### మాదాపూర్‌లో కన్నుల పండవగా అమ్మ భగవాన్ కళ్యాణ మహోత్సవం

**గన్నేరువరం, జూన్ 07 (జనంసాక్షి):**

గన్నేరువరం మండలం లోని మాదాపూర్ గ్రామ శ్రీ అమ్మ భగవాన్ దేవాలయంలో సంపూర్ణ అవతార మూర్తులైన శ్రీశ్రీశ్రీ పురుషోత్తమ అమ్మ భగవాన్ కళ్యాణ మహోత్సవాన్ని భక్త బృందం ఘనంగా కన్నుల పండుగగా నిర్వహించారు. మాజీ జెడ్పిటిసి మాదుగుల రవీందర్ రెడ్డి శృతి కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కోహెడ , బెజ్జంకి, గన్నేరువరం, చిన్నకోడూర్ మండలాలతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ క్రమంలో మంథని కి చెందిన అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి అంజనీ మిశ్రా కుటుంబ సభ్యులతో కలిసి అమ్మ భగవాన్ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. పెద్దపల్లి క్లస్టర్ ఇంచార్జ్ సతీ జి, ధర్మసంస్థాపకుడు ఓరుగంటి సంపత్, మాదాపూర్ భక్త బృందం నారాయణరెడ్డి, మంజులాజీ, పురోహితులు మొండయ్య, రాజు పాల్గొన్నారు.



## ఆరోగ్యకరమైన జీవనాన్ని ప్రోత్సహించడానికి 'హ్యాపీ' సండే కార్యక్రమం

### రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి..

**గోదావరిఖని, జనంసాక్షి:**

ఆరోగ్యకరమైన జీవనాన్ని ప్రోత్సహించడానికి హ్యాపీ సండే కార్యక్రమం అవసరమని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు.రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన హ్యాపీ సండే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత మార్చి నెలలో కూడా ఈ హ్యాపీ సండే కార్యక్రమాన్ని గోదావరినదిలో చెత్త ఏరివేసిన తరువాత క్రీడా పోటీలు నిర్వహించి ఘనంగా చేపట్టడం జరిగిందని అన్నారు.డిజిటల్ స్క్రీన్స్‌కు అలవాటుపడి శారీరక, మానసిక సామర్థ్యాన్ని పెంచే యోగా, క్రీడలలో ప్రజలు భాగస్వాములు కాకపోవడం వలన రోగాల బారిన పడి హాస్పిటల్ చుట్టూ తిరుగుతూ డబ్బులు ఖర్చు పెట్టు కోవాల్సిన దుస్థితి.అలాగే అనేక ఇబ్బందులు పడే పరిస్థితి కూడా తలెత్తుతుందని అన్నారు.ఈ నేపధ్యంలో మెట్రో నగరాలకు మాత్రమే పరిమితమైన ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చిన్న పట్టణాలు, నగరాల్లో కూడా చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఆరోగ్యంపై ఇప్పటికే కొంత మేర స్పృహ వచ్చిందని నగరంలోని మైదానాలలో చాలా మంది కనిపిస్తున్నారని అన్నారు. ఇది శుభ పరిమాణమని అన్నారు. మెప్మా సిబ్బంది సహకారంతో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికతో పాటు అనేక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. రామగుండం నగరాన్ని ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దే ఎంఎల్ఏ ప్రయత్నంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజల ఆరోగ్యం కూడా ప్రధానమని ప్రభుత్వం తలచి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు.అదనపు కలెక్టర్



(స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ, నగర పాలక సంస్థ టిపిఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, సీనియర్అసిస్టెంట్ శ్రీపాల్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్, మెప్మా టిఎంసి మౌనిక, యోగా గురువు గణేష్, వ్యాయమ ఉపాధ్యాయులు శోభారాణి, తిరుపతి,దావీద్ సిఒలు, ఆర్‌పిలు, సిబ్బంది పాల్గొన్నారు.కాగా ఈ కార్యక్రమంలో భాగంగా యోగాతో పాటు కబడ్డీ, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు.పోటీలో విజేతలకు మెమెంటో, బహుమతుల ప్రదానం చేశారు.

# బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం నేరం

### బాల కార్మికులు కనిపిస్తే వెంటనే 1098కు సమాచారం ఇవ్వాలి

**కరీంనగర్ టౌన్, జూన్ 7 ( జనం సాక్షి)** బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోందని, బాలలను పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని అధికారులు హెచ్చరించారు. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా కరీంనగర్ పట్టణంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి యజమానులకు అవగాహన కల్పించారు. కరీంనగర్ పట్టణంలోని ఎ-వన్ చికెన్ సెంటర్లో బాల కార్మికులు పనిచేస్తున్నారనే సమాచారాన్ని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఉచిత సేవకు స్థానికులు అందించారు. సమాచారం అందిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కోఆర్డినేటర్ సంపత్ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ సృజన్ రెడ్డి సహకారంతో డీసీపీవో పర్వీన్, చైల్డ్ హెల్ప్ లైన్ కేస్ వర్కర్ సుందరగిరి సాయి కిరణ్ గౌడ్, పోలీస్ స్పెషల్ టీమ్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది కలిసి సంబంధిత షాపును సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బాల కార్మికుల నియామకానికి సంబంధించిన నిబంధనలను యజమానికి వివరించారు.బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం బాల కార్మిక (నిషేధం, నియంత్రణ) చట్టం ప్రకారం శిక్షార్హమైన నేరమని అధికారులు స్పష్టం చేశారు. బాలల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడే ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని




హెచ్చరించారు. షాపు యజమానికి కౌన్సిలింగ్ నిర్వహించి, బాలుడిని వెంటనే పాఠశాలలో చేర్పించి విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అధికారులు మాట్లాడుతూ, బాలల సంక్షేమం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. హోటళ్లు, దుకాణాలు, వర్క్‌షాప్‌లు, పరిశ్రమలు లేదా ఇతర ప్రాంతాల్లో బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గమనించినా, బాలల హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన ఏ సమస్య కనిపించినా వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతోనే బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం సాధ్యమవుతుందని వారు తెలిపారు.

# జూన్ 9న కరీంనగర్‌లో జాబ్ మేళా

**కరీంనగర్ టౌన్, జూన్ 7: ( జనం సాక్షి)** కరీంనగర్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 9న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై. తిరుపతి రావు తెలిపారు.కరీంనగర్‌లోని వరుణ్ గ్రూప్ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ కేర్, డ్రైవర్, టెక్నీషియన్ పోస్టుల భర్తీ కోసం ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 20 ఖాళీలకు పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.డిగ్రీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా లేదా అంతకంటే పై చదువులు పూర్తి చేసిన 20 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులని వెల్లడించారు. ఎంపికైన వారికి నెలకు రూ.10,000 నుంచి రూ.20,000 వరకు వేతనం అందజేయనున్నట్లు తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 9న ఉదయం 11 గంటలకు కాశ్మీర్‌గడ్డలోని ప్రభుత్వ ఈ-సేవ కేంద్రం పై అంతస్తులో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయానికి విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరై తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9908230384, 9963357250 నంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి కోరారు.

# మృగశిల కార్తె సందడి... చేపలకు బగ డిమాండ్

**ముస్తాబాద్ జూన్ 07(జనం సాక్షి)** భారతీయ జ్యోతిష్య, వ్యవసాయ పంచాంగాల ప్రకారం. సూర్యుడు మృగశిర నక్షత్రంలో ప్రవేశించే కాలాన్నే మృగశిర కార్తె అంటారు. ప్రతి సంవత్సరం జూన్ మొదటి వారంలో (సాధారణంగా జూన్ 7 లేదా 8వ తేదీల్లో) ఈ కార్తె ప్రారంభమవుతుంది. ఇది వర్షాకాలం



ఆరంభానికి మరియు వర్షాలు పడటానికి సూచికగా పరిగణించబడుతుంది.మృగశిర కార్తెకు సంబంధించిన ముఖ్యమైన విశేషాలు. వర్షాకాలం రాక: అంతకు ముందు రోహిణి కార్తెలో ఎండలు మండిపోతాయి. అయితే ఈ మృగశిర కార్తె ప్రవేశంతో నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశిస్తాయి. వాతావరణం చల్లబడి, వర్షాలు మొదలవుతాయి.ఏరువాక సాగే కాలం: రైతులు తొలకరి జల్లులు పడగానే పొలాలను దున్ని, పంటలు వేయడానికి ఈ కాలాన్ని అత్యంత అనుకూలంగా భావిస్తారు.ఆరోగ్య పరిరక్షణ: వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల సూక్ష్మక్రిములు వృద్ధి చెంది, వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. దీనిని తట్టుకోవడానికి మృగశిర కార్తె మొదటి రోజున బెల్లంలో ఇంగువ కలిపి తినడం ఆనవాయితీగా వస్తోంది. ఇది శరీర ఉష్ణాన్ని సమతుల్యం చేసి, రోగనిరోధక శక్తిని పెంచుతుందని నమ్ముతారు.చేపల భోజనం: మృగశిర కార్తె ప్రారంభం రోజున తప్పనిసరిగా చేపల కూర తినాలనేది మన తెలుగు రాష్ట్రాల్లోని ప్రజల నమ్మకం. దీనివల్ల వర్షాకాలంలో వచ్చే జలుబు, దగ్గు వంటి సమస్యలు దరిచేరవని పెద్దల విశ్వాసం.మీరు మృగశిర కార్తె సందర్భంగా చేపలు లేదా ఇంగువ కొనుగోలు చేయడానికి సమీపంలోని మార్కెట్లో చేపలకు 500, కిలో ప్రజలు క్యూ లైన్ లో నిలబడి తీసుకుంటున్నారు. మండల కేంద్రంలో వివిధ పొరుగు మండలాల నుండి పరుగు జిల్లాల నుండి వచ్చి ఇంటింటికి తిరుగుతూ చేపలు అమ్ముతున్నారు. ఈ ఈ మృగశిర కార్తిలో చేపలు తినాలని అదొక నమ్మకం సంవత్సరం పాటు ఆరోగ్యంగా ఉంటామని ప్రజల యొక్క నమ్మకం.

## జెండా పండుగలో పాల్గొన్న నాయకులు ఘనంగా జెండా పండుగ

**చొప్పదండి, జూన్ 7 (జనం సాక్షి ):**చొప్పదండి పట్టణంలోని పోచమ్మ దేవాలయం సమీపంలో విగ్రహం వద్ద తెలంగాణ రక్షణ సేన జెండా పండగ కార్యక్రమాన్ని చొప్పదండి నియోజకవర్గ ఇన్చార్జ్ మ్యాకల తిరుపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి తెలంగాణ రక్షణ సేన జెండాను ఎగరవేశారు. కార్యక్రమం లో కరీంనగర్ జిల్లా తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ ,చొప్పదండి నియోజకవర్గం నాయకులు గుండేటి తిరుపతి , ఏనుగు మల్లారెడ్డి పిట్టల సత్యం,రాముల రమేష్,కుతాడి శ్రీనివాస్, వెంకటేష్, రత్నాకరచారి, లింగంపల్లి శ్రీనివాస్,తిరుపతి చంటి శ్రీనివాస్, పవన్, ,చందు అంజలి, అపర్ణ, అలేఖ్య, నాయకులు పాల్గొన్నారు.



## వీణవంక పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

### సిపిఎం మండల కార్యదర్శి పిల్లి రవి యాదవ్



**వీణవంక జూన్ 7 (జనం సాక్షి)** వీణవంక కేంద్ర ప్రభుత్వం తాజాగా డొమెస్టిక్ సిలిండర్ పై 29 రూపాయలు పెంచిందని వెంటనే పెంచిన ధరలు తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి రవి యాదవ్ డిమాండ్ చేశారు.బిజెపి ప్రభుత్వం మూడు నెలల కాలంలో రెండుసార్లు గ్యాస్ ధరలు పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. బిజెపి పాలనలో అచ్చే దినాలు రాలేదని చచ్చే దినాలు వచ్చాయి అన్నారు.ఒకవైపు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచి సామాన్యుడి నెలవారి బడ్జెట్ ను తలకిందులు చేసిందన్నారు. దేశభక్తి పేరుతో దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు. దేశ సామాన్యులపై మోయలేని అధిక భారాలు వేస్తున్నదని,ఆర్థిక అసమానతలు వేగంగా పెరుగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించి సామాన్యులకు మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించాలన్నారు. ఒకవైపు ధరల పెరుగుదల మరోవైపు గ్యాస్ సిలిండర్ ఆన్లైన్లో బుక్ చేసి 20 రోజులు దాటిన వినియోగదారునికి సిలిండర్ అందడం లేదన్నారు.లేని యెడల ప్రజలను సమీకరించి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారన్నారు.

## తెర్లుమద్దిలో వడ్ల కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు పూర్తి



**ముస్తాబాద్ జూన్ 07 (జనం సాక్షి)** ముస్తాబాద్ మండలంలోని తెర్లుమద్ది గ్రామంలో ఐకెపి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్ల కొనుగోలు కేంద్రంలో వడ్ల కొనుగోళ్లు ఈరోజుతో విజయవంతంగా పూర్తయ్యాయి.కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువుకంటే ముందుగానే పూర్తి చేయడంలో సహకరించిన , ఐకెపి నిర్వాహకులు, హమాలీ కార్మికులు, సంబంధిత అధికారులు, గ్రామ రైతులు, మిల్లర్ నిర్వాహకులకు గ్రామ సర్పంచ్ బైతి దుర్గమ్మ నవీన్ అభినందనలు తెలిపారు. అందరి సమన్వయం, సహకారంతో కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తైందని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐకెపి నిర్వాహకులు, హమాలీ కార్మికులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్న విద్యార్థులు

### ప్రతి ఒక్కరు వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలి




**చొప్పదండి, జూన్ 7 (జనం సాక్షి):** ప్రతి ఒక్కరూ వ్యాయామమును, వాకింగ్ను అలవాటు చేసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని మున్సిపల్ చైర్పర్సన్ వడ్లూరి సరిత- శ్రీనివాస్ పేర్కొన్నారు. చొప్పదండి పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఏర్పాటు చేసిన హ్యాపీ సండే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన యోగ వ్యాయామం, ఆత్మరక్షణ కొరకు ఉపయోగపడే కళలు, కర్రసాము, కరాటే ప్రదర్శన, నృత్య కళాప్రదర్శన, డ్యాన్స్ మొదలగు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస-గంగయ్య, కౌన్సిలర్లు రాజశేఖర్, వెంకటేష్, కమిషనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు .

# యోగి రామన్న 1వ వార్షికోత్సవం



**ముస్తాబాద్ జూన్ 7 (జనం సాక్షి)** ముస్తాబాద్ మండల కేంద్రంలోని యోగి రామన్న దేవాలయంలో ఒకటవ వార్షికోత్సవం సందర్భంగా హోమం, రామన్న కళ్యాణం, ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ దండోరా జిల్లా నాయకులు చుంచు మల్లన్న మాట్లాడుతూ యోగి రామన్న అనే వ్యక్తి ఎవరో కాదు భారతదేశంలో మొట్టమొదటి కవి, ఒక మాదిగ జాతికి సంబంధించిన వ్యక్తి కాబట్టే చరిత్రలో రాయ లేకపోయారు. ఇలాంటి ఋషులు ఎంతోమంది ఉన్నారు . కానీ వారిని మాత్రం భారత దేశ ప్రజలకు ఇంతవరకు తెలియదు ప్రభుత్వ పార్టీలకు సంబంధించిన నాయకులను మాత్రమే గుర్తిస్తారు. తప్ప సమాజానికి సేవ చేసిన వ్యక్తులను మాత్రం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన చుంచు మల్లన్న భారతదేశంలో మాదిగ కులానికి చెందినటువంటి జనాభా లక్షల్లో ఉంది కానీ వారిని మాత్రం గుర్తించడం మాదిగ జాతిపైన దాడులు, అనిచివేత అప్పటినుండి ఇప్పటివరకు మాదిగలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపే చూస్తున్నాయి యోగి రామన్న చరిత్రను పాఠ్యపుస్తకాలలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ కుల పెద్ద కొల్లూరి మహేష్, ఎడ్ల వెంకటయ్య, ముక్క నరసయ్య, చుంచు బాబు, చుంచు విజయ్, కొల్లూరి శంకరయ్య, గుండెల్లి దేవ రాములు, నల్ల సంతోష్, నల్ల బాలయ్య, జిల్లాల రమేష్, కొల్లూరి రాజు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని యోగి రామ న్నకు ప్రత్యేకంగా మంగళహారతులతో పూజలు నిర్వహించారు.

# అల్లీపూర్ శక్తి కేంద్రం అధ్యక్షుడిగా మణికంఠ



**రాయికల్ జనం సాక్షి:-** రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పార్టీ ఆదేశాల మేరకు నూతన గ్రామ కమిటీని గ్రామ సీనియర్ నాయకులు ఆధ్వర్యంలో శక్తి కేంద్రం అధ్యక్షుడిగా ఇనుకగుర్తి మణికంఠను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ శక్తి కేంద్రం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి సహకరించిన బాజాపా కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు చేయడానికి కుటుంబ సభ్యులందరికీ సహకారంతో పార్టీని బలోపేతం చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాలే చంద్రశేఖర్, సీనియర్ నాయకులు అంగడి పరమేశ్వర్, రాజశేఖర్, రాజగోపాల్, రమేష్, మల్లికార్జున్, రచన్, శశిధర్,ఆదర్శ్, నందు, మణికంఠ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన సురేష్




**రుద్రంగి జూన్ 7 (జనం సాక్షి)** కామారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 6, 7 తేదీలలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ -2026 పోటీలలో రుద్రంగి మండలం,దేగావత్ తండాకు చెందిన గిరిజన యువకుడు గుగులోత్ సురేష్ అండర్-19 విభాగం సింగిల్స్ బ్యాడ్మింటన్ పోటీలలో రన్నర్-అప్‌గా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది.మారు మూల గిరిజన ప్రాంతం నుండి వచ్చి తన ప్రతిభతో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించడం పట్ల స్థానిక ప్రజలు, క్రీడా ప్రేమికులు హర్షం వ్యక్తం చేశారు.అలాగే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేగావత్ తండా, రుద్రంగి మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అభినందనలు తెలిపారు.

# నర్మల గ్రామంలో మహాత్మ జ్యోతిరావు సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరణ

- హాజరైన మాజీ శాసనసభ్యులు కటకం మృత్యుంజయం, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్శ హనుమాన్లు, బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, ముదిరాజ్ నాయకులు.



**గంభీరావుపేట జూన్ 07(జనం సాక్షి);** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాత్మ జ్యోతిరావు సావిత్రిబాయి పూలే ల విగ్ర ఆవిష్కరణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కనేబోయిన లింగం పిట్ట నరసయ్య. గ్రామ సర్పంచ్ రాజబోయిన అర్చన అంజనేయులు ఆధ్వర్యంలో విగ్ర ఆవిష్కరణ ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్ష హన్మండ్లు ముదిరాజ్ జిల్లా అధ్యక్షులు చొక్కాల రాము బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి కాంగ్రెస్ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్. ముదిరాజ్ నాయకులు పాల్గొని మాత్మ జ్యోతిరావు సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, ముఖ్యంగా మహిళల విద్య కోసం జీవితాన్ని అంకితం చేసిన ఈ దంపతుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని అందరూ ముందుకు సాగాలని అన్నారు. అనంతరం వచ్చిన అతిథులను ముదిరాజ్ సంఘ సభ్యులు శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ చైర్మన్ చొప్పరి రామచంద్రం. బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి ముదిరాజ్ మండల అధ్యక్షులు శాస్త్ర బోయిన లక్ష్మణ్. జై సింహ బొజ్జ కనకయ్య జిల్లా ఉపాధ్యక్షులు దేవయ్య. మాజీ జెడ్పిటిసి మల్లు గారి నర్సాగౌడ్ రైతుబంధు అధ్యక్షులు ధాన్యబోయిన రాజేందర్ . పిట్ల రాంగోపాల్. ముదిరాజ్ నాయకులు పెరిమేళ రమేష్. పిట్ల బాబు వీరబోయిన రమేష్ ఆనందం తోక దేవదాస్. ముదిరాజ్ కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

# గంభీరావుపేట రాములోరి ఆశీస్సులతో రైతన్నల్లో ఆనందం

**ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ముడుపు విప్పు కార్యక్రమం,హాజరైన రైతన్నలు..**



**గంభీరావుపేట జూన్ 7 (జనం సాక్షి):** కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తున్న గంభీరావుపేట రైతన్నలకు శ్రీ సీతారాముల స్వామి ఆశీస్సులతో నష్టం జరగకుండా కాపాడుతాడని ఇక్కడి రైతుల ప్రజల నమ్మకం అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా పండించిన పంట కోసి పూర్తయిన తరుణంలో ఆదివారం రోజు ముడుపు విప్పి కార్యక్రమం చేపట్టారు వివరాల్లోకెళ్తే రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో శ్రీ సీతారామ స్వామి ఆలయంలో ప్రతి ఏటా పంటలు పొట్ట దశలో ఉండడంతో గ్రామ రైతులు అకాల వడగండ్ల వర్షాలు పడకుండా ముడుపు వేస్తారు ఆలయ కమిటీ చైర్మన్ మల్లుగారి నర్సా గౌడ్ రైతుల ఆధ్వర్యంలో గ్రామంలో పూర్తిస్థాయిగా పంటలు కోసి కొనుగోలు అవడంతో సీతారామచంద్ర స్వామి ప్రత్యేక పూజలు చేసి రైతులు ఆలయ కమిటీ సభ్యులు కలిసి ముడుపు విప్పి ఉత్సవమూర్తులను గ్రామంలో పురవీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నర్సా గౌడ్ మాట్లాడుతూ గరుడసేవ అనంతరం అకాల వర్షాల వల్ల ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు పండించిన పంట ధాన్యము క్షేమంగా ఇంటికి చేరి లాభము దేవుని కర్ణ ఉండాలని వందలాది సంవత్సరాలుగా సీతారామస్వామి ఆలయంలో ముడుపు కట్టడం సీతారామచంద్ర స్వామి ఆశీస్సుల వల్ల పంటలు ఎలాంటి నష్టం కలగకుండా ఉండడంతో వల్ల రైతులందరూ ప్రజల సమక్షంలో ఆలయంలో ముడుపు విప్పి గరుడసేవపై స్వామివారిని ఊరేగించారని సాసితారామస్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రైతులు ప్రజలు పాల్గొన్నారు.

# సత్యశోధక్ నుంచి సైన్యం వరకు.. వర్షిత్ విజయ ప్రస్థానం

**అగ్నివీర్‌గా ఎంపికైన పూర్వ విద్యార్థికి ఘన సన్మానం**




**సిరికొండ, జూన్ 7 (జనం సాక్షి):** సత్యశోధక్ పాఠశాలలో విద్యనభ్యసించి భారత సైన్యంలో అగ్నివీర్‌గా ఎంపికైన పూర్వ విద్యార్థి బాదాల వర్షిత్‌ను ఆదివారం పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య శాలువా కప్పి, ప్రత్యేక జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సత్యశోధక్ పాఠశాలలో చదువుకున్న విద్యార్థి దేశ రక్షణ బాధ్యతలను నిర్వర్తించే స్థాయికి ఎదగడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు. బాదాల వర్షిత్ సాధించిన విజయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. క్రమశిక్షణ, కృషి, పట్టుదల, అంకితభావం ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని అన్నారు. దేశ సేవ అత్యున్నతమైన సేవ అని, భారత సైన్యంలో అగ్నివీర్‌గా ఎంపిక కావడం గొప్ప గౌరవమని తెలిపారు. దేశ రక్షణలో తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని వర్షిత్‌కు సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం మరియు నిరంతర కృషితోనే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. సత్యశోధక్ పాఠశాల పూర్వ విద్యార్థి సాధించిన ఈ ఘనత ప్రస్తుత విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతుందని, వారు కూడా ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, కుటుంబానికి, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగారెడ్డి, శంకర్, అనిల్, సంతోష్ తదితరులు పాల్గొని వర్షిత్‌ను అభినందించారు.



## కుమ్మర కుల వృత్తి దారుల సమస్యల పరిష్కారానికి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు టి ఆర్ కె ఎస్ వినతి

**సుల్తానాబాద్,జూన్ 07(జనంసాక్షి) :**
తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంత్ రావు ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను ఆదివారం కలిసి కుమ్మర కులస్తుల పలు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి వినతి పత్రం అందజేశారు.కుమ్మర ఆత్మ భవనం ట్రెస్ట్ నిర్మాణం కోసం 3కోట్ల నిధులు ప్రభుత్వం కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.ప్రతి ఏడాది లాగే నిర్వహించబోయే లోయర్ ట్యాంక్ బండ్ కనకాల కట్ట మైసమ్మ దేవాలయం వద్ద నిర్వహించే బోనాల జాతర నిర్వహణతో పాటు ఈ జాతరకు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను,ఇతర మంత్రులను ఆహ్వానించడం జరిగిందన్నారు. కుమ్మర కుల వృత్తి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే చెరువులో కుంటల్లో కుమ్మర కులవృత్తి కోసం తీసే మట్టి కి సంబంధించిన జీవోను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు పరచాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ప్రతినిధులు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను కోరారు.ఇందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశమ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్, రాష్ట్ర కోశాధికారి అమంచి రాజలింగము, రాష్ట్ర అన్సోసియాట్ అధ్యక్షులు కే. లక్ష్మి నారాయణ, టి.కే. శ్రీనివాస్,రాష్ట్ర ఉపాధ్యక్షులు రామన్ కోల్ వీరేశం,వృత్తి విభాగం రాష్ట్రఅధ్యక్షులు గుండాల గోవర్ధన్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు కమ్మంపటి సత్యనారాయణ,రాష్ట్ర ప్రచార కార్యదర్శులు అగిరిశెట్టి వీరన్న, నిమ్మలూరి శ్రీనివాస్, రామన్ కోల్ ప్రభాకర్,నడికుడ అశోక్,ఆమంచి దుర్గ ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

## శాంతి..అహింస మార్గంమే ప్రపంచ శాంతి

### - ఎన్‌వైపీ రాష్ట్ర అధ్యక్షులు యాదవరాజు..

**గోదావరిఖని, జనంసాక్షి:**
గత రెండు రోజుల నుంచి జరుగుతున్న గాంధీ ఆలోచన..ఆయన పనులు శాంతి..అహింస మార్గాల ప్రభావం ఈ సమాజంపైన అనే అంశంపై జరుగుతున్న యువజన వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాదంబరి ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ఫౌండర్, చైర్మన్ బోయిని రాజేందర్ హాజరయ్యారు.దాదాపు 18 జిల్లాల 20 నుండి 30లోపు యువత పాల్గొని శాంతి ఆ హింస మార్గమే శరణ్యమని గాంధీజీ ఆలోచన విధానం తోటి సమాజం మనగలుగుతుందన్నారు.మానవ సంబంధాలు గాంధీయ మార్గంలో మెరుగుపడుతున్నాయన్నారు. అనంతరం గాంధీ సాహిత్యాన్ని యువతకు పంపిణీ చేశామన్నారు.అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా శాలువాతో సన్మానించారు.కార్యక్రమానికి సహకరించిన తెలంగాణ గాంధీ స్మారక నిధి పెద్దలకు, నిఫా, ఎన్‌వైపీ వాలంటీర్స్‌కు అందరికి కూడా ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్ర అధ్యక్షులు కె.యాదవరాజు ప్రసంగిస్తూ నేటి సమాజానికి గాంధీ సందేశాలు, ఆయన ప్రబోధించిన నిర్మాణాత్మక కార్యక్రమాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు.సమాజంలో తప్పకుండా శాంతి నెలకొని ప్రతి ఒక్కరి పట్ల సత్సంబంధాలు మెరుగుపడి సమాజ పురోగతికి దారితీస్తుందని యాదవరాజు సందేశం ఇచ్చారు.ఆయన పాడిన యువజన గీతాలకు యువకులు ఎంతో ఉత్తేజపరిచాయి.రెండు రోజుల ఈ శిక్షణ శిబిరం గోదావరిఖని స్నేహ సాహితి గ్రంధాలయం ఆవరణలో నిర్వహించారు.




## జేబీసీసీఐ సమావేశంలో కీలక పాత్ర పోషించిన జనక్‌ప్రసాద్..

### - జనక్‌ప్రసాద్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదు.. - ఐఎన్‌టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి..

**గోదావరిఖని, జనంసాక్షి:**
ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కె.సదానందం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐఎన్‌టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి మాట్లాడారు. రాష్ట్రీయ కోల్ మజ్దూర్ సంఘ్ (ఆర్‌సీఎం) పేరుతో సింగరేణిలో యూనియన్ నిర్వహిస్తున్న కొందరు నాయకులు కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శిం చారు. జేబీసీసీఐ సమావేశాల్లో పాల్గొని గత ఏడాది బొగ్గు గనుల కార్మికులకు సంబంధిం చిన పీఎల్‌ఆర్ బోనస్ పెంపులో కీలక పాత్ర పోషించిన ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్‌ను విమర్శించడం సమం జసం కాదని ఆయన అన్నారు.గత 50 ఏళ్లుగా కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడిపై కేవలం ప్రచారం కోసం విమర్శలు చేయడం తగదని, అలాంటి చర్యలకు కార్మికులే తగిన గుణ పాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రజా స్వామ్యంలో ఎవరైనా సంఘం ఏర్పాటు చేసుకోవచ్చని, అయితే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేసిన సేవల ఆధారంగానే నాయకత్వాన్ని అంచనా వేయాలని ఆయన పేర్కొన్నారు.2007లో ఎన్నికల్లో పోటీ చేసిన తర్వాత ఇప్పటి వరకు కార్మికుల కోసం ఆర్‌సీఎం నాయకులు సాధించిన విజయాలు ఏమిటో కార్మికులకు వివరించాలని ప్రశ్నిం చారు. గత 12 ఏళ్లుగా తెలంగాణలో పెం డింగ్‌లో ఉన్న సుమారు 1.20 కోట్ల మంది కార్మికుల కనీస వేతనాల సవరణ ప్రక్రియ ను, తెలంగాణ ప్రజా ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి సహకారంతో కనీస వేతనాల సలహా మండలి చైర్మన్‌గా జనక్‌ప్రసాద్ రెండేళ్ల వ్యవధిలో విజయవంతంగా అమలు చేసి లక్షలాది కార్మిక కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తుచేశారు. సింగరేణిలో మెడికల్ బోర్డు వ్యవస్థ నిలిచిపోవడానికి కారణమైన వారినే పక్కన కూర్చోబెట్టుకుని కార్మికుల హక్కుల కోసం పోరాడతామనడం విడ్డూరమని ధర్మపురి వ్యాఖ్యానించారు. కార్మికుల సంక్షేమం కోసం నిజాయితీగా పోరాటం చేస్తున్న నాయకులను విమర్శించడం మానుకుని, కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తే మంచిదని హితవు పలికారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు లక్ష్మీపతిగౌడ్ (జనరల్ సెక్రటరీ), గడ్డం కృష్ణ (డిప్యూటీ జనరల్ సెక్రటరీ), బర్ల మనోహర్ (సెక్రటరీ), బుచ్చిరెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




## పెంచిన ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలి..

**గోదావరిఖని, జనంసాక్షి:**
కేంద్రం ప్రభుత్వం మళ్ళీ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధర పెంచిందని..సిలిండర్ ధర 29 రూపాయలు ధరతో సామాన్య ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.అవస్తలు పడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు పెరిగిన ధరలతో కొనుగోలు చేసే శక్తి లేక అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు.పేద మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక నష్టంతో దేశంలో పేద,మధ్యతరగతి ప్రజల పట్ల ఏమాత్రం ప్రేమ ఉన్నా తక్షణమే పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం రాష్ట్ర నాయకులు సుతారి లక్ష్మన్‌బాబు,జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి మంథెన వెంకటేష్ కేంద్ర ప్రభుతాన్ని డిమాండ్ చేసారు.వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తారన్నారు.ఇప్పటికైనా ధనిక వ్యాపార వర్గాలకు అనుకూల విధానాలు విడనాడి సామాన్య ప్రజలకు మేలు చేసే విధానాలు అమలు చేయాలని వారు తెలిపారు.



## నూతన కార్యవర్గం

**రాయికల్ జనం సాక్షి:** రాయికల్ పట్టణ మాల యువజన సంఘం ఎన్నికలు ఆదివారం రోజున నిర్వహించారు. పట్టణ మాల యువజన సంఘం అధ్యక్షుడిగా చెంగలి గంగాధర్ ఏకగ్రీవగం ఎన్నుకోవడం జరిగింది. సంవత్సరాన్ని ఒక్కసారి జరిగే సర్వ సభ్య సమావేశంలో ఆదాయ వ్యయాలను సరిచూసుకుని, చేపట్టిన కార్యక్రమలపై చర్చించారు. సంఘ అభివృద్ధి కృషి చేస్తామని అన్నారు.అనంతరం నూతనంగా ఎన్నిక కాబడిన రాయికల్ పట్టణ11 వ వార్డు కౌన్సిలర్ పురె శ్రీధర్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పురె శ్రీనివాస్,రమేష్,శ్రీధర్ బందెల శ్రీనివాస్,ముక్కెర శ్రీను,గుర్రం శేఖర్ మ్యకల తిరుపతి,బైరీ వెంకటేష్, రాజేందర్,శేఖర్, ఇద్రాల అరవింద్,మ్యకల రాజేశం, అచ్చ రవి వరుణ్,కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు.

## సన్మానం..

**మల్లాపూర్, జూన్07(జనంసాక్షి)**
మండలం లోని చిట్టాపూర్ గ్రామాని కి చెందిన 10వ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను మార్కండేయ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి మెమోటోను అందజేశారు. ఈ సందర్బంగా మార్కండేయ సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ విద్య ద్వారా మంచి వ్యక్తిత్వ నిర్మాణం జరుగుతుందన్నారు. ముందు ముందు మరిన్ని మంచి ర్యాంకులు తీసుకువచ్చి తల్లిదండ్రులకు గ్రామాని మంచి పేరు తీసుకువచ్చి ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో మార్కండేయ సేవా సమితి సభ్యులు గుమ్మడి మల్లేష్, బండారి మల్లేష్, ఆడెపు రాజేష్, దువ్వ నవీన్, గుమ్మడి నాగ రాజు, అరిశెల్ల శ్రీనివాస్, బండి రవిందర్, కొండబత్తిని రాజేష్, చేన్న నర్సయ్య, అందే సత్యం, కొండ గణేష్, జలందర్, రణదీర్, కొండబత్తిని హరీష్, నడిమెట్ల శ్రీనివాస్ మరియు పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ సేవలు మరింత బలోపేతానికి నూతన నాయకత్వం : సిరిసిల్ల ఎండీగా డి.తిరుపతి

**గోదావరిఖని, జనంసాక్షి:**
విద్యుత్ రంగంలో విశేష అనుభవం కలిగిన టీజీఎన్‌పీడీసీఎల్ సీనియర్ అధికారి డి.తిరుపతిని సిరిసిల్ల సెస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమిస్తూ సీఎండీ టీజీఎన్ పీడీసీఎల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన తన బాధ్యతలను స్వీకరించారు. టీజీఈఆర్‌సీ ఆదేశాల మేరకు 01-04-2026 నుండి సెస్ సిరిసిల్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు టీజీఎన్‌పీడీసీఎల్ ద్వారా అన్ని సేవలు సమర్థవంతంగా అందించనున్నారు.ఈ సేవల నిర్వహణను టీజీఎన్‌పీడీసీఎల్ సిరిసిల్ల ఆపరేషన్ ఎస్‌ఈ టి.వేణుమాధవ్ పర్యవేక్షిస్తున్నారు.ప్రస్తుతం సెస్ లిమిటెడ్ ఉద్యోగుల సహకారంతో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందుతున్న నేపథ్యంలో ఇకపై ఉద్యోగుల పరి పాలనా, సంస్థాగత వ్యవహారాల పర్యవేక్షణను మేనేజింగ్ డైరెక్టర్ డి.తిరుపతి చేపట్ట నున్నారు.ఈ సందర్భంగా స్థానిక ఎస్‌ఈ టి.వేణుమాధవ్ పుష్పగుచ్ఛం అందించి డి.తిరుపతికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.నూతన బాధ్యతల్లో ఆయన విజయవంతంగా ముందుకు సాగి సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డీఈలు ఎన్.అంజయ్య,జి.వెంకటరమణ, జిల్లా పరిధికి చెందిన ఏఓలు, ఏడీఈలు, ఏఏఓలు, ఏఈలు,ఇతర అధికారులు పాల్గొని నూతన మేనేజింగ్ డైరెక్టర్‌కు అభినందనలు తెలిపారు.సమర్థ నాయకత్వంతో సిరిసిల్ల సెస్ మరింత పురోగతి సాధిస్తూ వినియోగదారులకు ఉత్తమ విద్యుత్ సేవలను అందిస్తుందనే విశ్వాసాన్ని అధికారులు వ్యక్తం చేశారు.



## రేగుంట ప్రీమియర్ లీగ్ సీజన్-4 -విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం



**మల్లాపూర్, జూన్ 07(జనంసాక్షి )**ఆర్ పీ ఎల్ సీజన్-4 విజేతగా నిలిచిన బైరినేని చారిటబుల్ ట్రస్ట్. లిరన్నర్ టీం గా ఆర్ ఆర్ వారియర్స్ టీం.రేగుంటలో గత 15 రోజులుగా జరుగుతున్న రేగుంట ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ పోటీలలో భాగంగా ఫైనల్ మ్యాచ్ లో విజేతగా నిలిచిన బైరినేని చారిటబుల్ ట్రస్ట్ టీం కు ట్రోపి తో పాటు 20.0000 ఇరవై వేల రూపాయలు రన్నర్ టీం గా నిలిచిన ఆర్ ఆర్ వారియర్స్ (చాంద్) టీం సభ్యులకు ట్రోపితో పాటు 10.000 పదివేల రూపాయలు బహుమతి ప్లేయర్స్ కి మెడల్స్ మరియు బెస్ట్ బ్యాట్స్మాన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ అఫ్ ది సిరీస్, మ్యాన్ అఫ్ ది మ్యాచ్ ట్రోపిలను సర్పంచ్ తీట్ల లహరి రాజేష్, ఉప సర్పంచ్ గణవేణి నందిని మల్లేష్ రేగుంట ఆల్ యూత్ అసోసియేషన్ ఒస్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్, ఆర్ పీ ఎల్ మేనేజ్మెంట్ సభ్యులు, ప్రాంచైజీ ఓనర్లు దాతలు కలిసి బహుమతులను అందించారు..ఈ సందర్భంగా సహకరించిన ప్రాంచైజీ ఓనర్లు, దాతలు సర్పంచ్ తీట్ల లహరి రాజేష్, బైరినేని చారిటబుల్ ట్రస్ట్, ఆర్ ఆర్ వారియర్స్ చాంద్ పాషా, వాయుపుత్ర యూత్ సభ్యులు పీఎంపీ హిట్టర్స్ నాగశేష్ పోవాజీ, ట్రోపీ ల స్పాన్సర్ (కి శేషులు గోపిడి నరేష్) వెల్మ మహేష్ (కీర్తి శేషులు ఆరెల్ల లక్ష్మి)రాందాస్, కట్కమ్ రాజు, ఎనగందుల రాజేష్,భగవాన్,గోల్డెన్ స్పోర్ట్స్ అమీర్, దువాక నరేష్,ఉప సర్పంచ్ నందిని మల్లేష్ యాదవ్ లకు ౹్రా మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు ధన్యవాదములు తెలిపారు..

# నవ సమాజ నిర్మాణంలో 'లింగంపల్లి' యువతరం

- **పంచ పరివర్తన్ తో పల్లె ప్రగతికి బాటలు**
- **పర్యావరణ పరిరక్షణలో యువత ముందడుగు**
- **ఎకో బ్రిక్స్ -- ప్లాస్టిక్ వ్యర్థాలకు వినూత్న పరిష్కారం**
- **స్టీల్ బ్యాంక్‌తో ప్లాస్టిక్ రహిత గ్రామం వైపు అడుగులు**

**సదాశివనగర్ జూన్ 7 (జనంసాక్షి)**సమాజంలో మార్పు కేవలం మాటలతో కాదు, చేతలతోనే సాధ్యమని నిరూపిస్తున్నారు లింగంపల్లి గ్రామ యువత. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) శతాబ్ది సందర్భంగా పిలుపునిచ్చిన 'పంచ పరివర్తన్' (పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమరసత, స్వదేశీ జీవనశైలి, పౌర కర్తవ్యం, కుటుంబ ప్రబోధన్) భావజాలంతో ప్రేరణ పొంది, గ్రామాభివృద్ధే ధ్యేయంగా యువతరం ఐక్యతతో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. సమాజం, పర్యావరణం, సంస్కృతిని కాపాడుకుంటూ ఐదు స్తంభాల ఆధారంగా ప్రగతిపథంలో దూసుకుపోతున్నారు .1.పర్యావరణ పరిరక్షణ: ప్లాస్టిక్ రహిత గ్రామం వైపు..గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా, హరిత లింగంపల్లిగా మార్చేందుకు శనివారం రోజున దేవాలయాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు, యువతకు పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన రాజేంద్ర ప్రసాద్ కామారెడ్డి జిల్లా పర్యావరణ ప్రముఖ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల ప్రకృతికి, మానవ మనుగడకు ఎదురవుతున్న విపత్తులు, ఘోరమైన నష్టాలను వివరించారు. పర్యావరణాన్ని మనం ఎలా కాపాడుకోవాలో, ప్రతి ఒక్కరి బాధ్యత ఏంటో తెలియజేశారు.ఎకో బ్రిక్స్ (ఏకో- బ్రిక్స్) విప్లవం: ఇళ్లలో పేరుకుపోయే ప్లాస్టిక్ కవర్లను, వ్యర్థాలను పడేయకుండా వాటిని ప్లాస్టిక్ బాటిళ్లలో గట్టిగా నింపి 'ఎకో బ్రిక్స్'గా మార్చే విధానంపై కమిటీ అవగాహన కల్పించింది. ఎకో బ్రిక్స్ తయారు చేసి ఇచ్చిన వారికి విలువైన బహుమతులు అందజేశారు.హరిత సంకల్పం ఒ స్టీల్ బ్యాంక్: గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షిస్తామని కమిటీ తీర్మానించింది. అలాగే శుభకార్యాల్లో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్ల వాడకాన్ని పూర్తిగా అరికట్టేందుకు గ్రామంలో త్వరలోనే ఒక 'స్టీల్ బ్యాంక్'ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.2.సామాజిక సమరసత: కులాల సరిహద్దులు దాటి.. ఒక్కటైన గ్రామంకులాల పట్టింపులను పక్కనపెట్టి, సమాజమంతా ఒక్కటే అనే భావనను పెంపొందించేందుకు ఉత్సవ కమిటీ గట్టి పునాది వేసింది.అన్ని కులాలకు ప్రాతినిధ్యం: గ్రామంలోని దేవాలయాల ఉత్సవ కమిటీలో అన్ని కులాల వారికి సమాన భాగస్వామ్యం కల్పిస్తూ కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామంలో జరిగే ప్రతి పండుగను గ్రామం ఒక కుటుంబం గా ఈ కమిటీ ఆధ్వర్యంలో ఊరి ప్రజలందరి భాగస్వామ్యంతో



ఘనంగా నిర్వహిస్తున్నారు.41 వారాల నిరంతర సాధన: ప్రతి శనివారం గ్రామంలో నిర్వహిస్తున్న సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం గడిచిన 41 వారాలుగా ఒక్క వారం కూడా ఆపకుండా నిరంతరాయంగా కొనసాగుతోంది. చిన్న పెద్ద అనే కులభేదం లేకుండా అబాలగోపాలం తరలివస్తూ భక్తిభావంతో పాటు సామాజిక సామరస్యాన్ని చాటుతున్నారు.3.స్వదేశీ జీవనశైలి: మన వస్తువులు - మన సంస్కృతిమన దేశ ఆర్థిక బలానికి, సంస్కృతికి యువత పెద్దపీట వేస్తోంది.స్వదేశీ ఉత్పత్తుల వాడకం:నిత్య జీవితంలో వీలైనంత వరకు భారతదేశంలో తయారైన స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, స్థానిక వ్యాపారులను ఆదుకోవాలని గ్రామస్తుల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.సంస్కృతీ సంప్రదాయాల రక్షణ: పాశ్చాత్య సంస్కృతి వైపు పరుగెత్తకుండా, మన పండగలు, సాంప్రదాయాలు, వాటి వెనుక ఉన్న విశిష్టతలను నేటి తరానికి చాటిచెప్పేలా కార్యక్రమాలు డిజైన్ చేస్తున్నారు.కుటుంబాల అనుబంధం: మొబైల్ ఫోన్లు, టీవీలకు దూరంగా వారంలో కనీసం ఒక్క రోజైనా కుటుంబ సభ్యులంతా కలిసి కూర్చుని మాట్లాడుకునేలా, పెద్దలను గౌరవించేలా, పిల్లలకు చిన్నతనం నుంచే నైతిక విలువలను నేర్పేలా ఇళ్లల్లో అవగాహన కల్పిస్తున్నారు.గ్రామ వికాసానికి బాటలు వేస్తున్న ఈ అద్భుతమైన అవగాహన కార్యక్రమం మరియు పంచ పరివర్తన్ సంకల్పంలో లింగంపల్లి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, దేవాలయాల ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. యువత తీసుకుంటున్న ఇటువంటి నిర్ణయాల వల్ల గ్రామం మరింత ఆదర్శంగా మారుతుందని పాలకవర్గ సభ్యులు కొనియాడారు.ఆదర్శంగా లింగంపల్లి గ్రామం..'పంచ పరివర్తన్ ద్వారా లింగంపల్లిని ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి" అని దేవాలయాల ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు.లింగంపల్లి యువత తీసుకున్న ఈ ఐదు అంచెల నిర్ణయాలు చుట్టుపక్కల గ్రామాలకు సైతం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. యువత చేస్తున్న ఈ అద్భుతమైన కృషిని గ్రామ పెద్దలు, మేధావులు ప్రశంసిస్తున్నారు.

## చిన్న కొడపుగల్ గ్రామ పంచాయతీ పరిధిలో బ్లీచింగ్ పౌడర్ చల్లించిన :సర్పంచ్ రెడ్డి కిరణ్ కుమార్



**పిట్లం జూన్ 07(జనం సాక్షి)**పిట్లం మండల పరిధిలోని చిన్న కొడపుగల్ గ్రామంలో వర్షాకాలం ప్రభావం వల్ల గ్రామాల్లో మురికినీరు చేరి రోగాల బారినపడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు సర్పంచి రెడ్డి కిరణ్ కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఆధ్వర్యంలో ఆదివారం బ్లీచింగ్ చల్లించారు. అలాగే మంచినీటి సదుపాయం లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనారోగ్యం బారినపడకుండా, కలుషిత నీరు తాగకూడదని తెలియజేస్తూ, శుద్ధమైన మంచినీటిని అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు , గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వడ్డేపల్లి



**గోదావరిఖని, జనంసాక్షి :**సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బిఎంఎస్) రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం (జనరల్ బాడీ) సమావేశం భూపాల్ పల్లిలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా అఖిలభారత బొగ్గు గనుల ఇంచార్జ్ (బిఎంఎస్) ముఖ్యఅతిథికి విచ్చేశారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర (బిఎమ్ఎస్) అధ్యక్షులు కల్లాల శ్రీనివాస్ వ్యవహరించారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ అధ్యక్షులుగా అప్పాని శ్రీనివాస్ ,ప్రధాన కార్యదర్శిగా వడ్డేపల్లి కుమారస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షునిగా యాదగిరి సత్తయ్య, ట్రెజరర్ గా సాయి వేణి సతీష్ తదితరులు ఎంపికయ్యారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేసిన కార్మికులకు, కార్మిక నాయకులకు రాష్ట్రకమిటీ తరపున హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

## చైతన్య ఒకేషనల్ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవద్దు



**బోధన్, జూన్ 7 ( జనంసాక్షి ) :** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో గల చైతన్య ఒకేషనల్ కాలేజీలో విద్యార్థిని విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవద్దని, తీసుకటున్న తర్వాత విద్యార్థిని విద్యార్థులు మోసపోవద్దని ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ విద్యార్థి సంఘం నిజామా బాద్ జిల్లా అధ్యక్షులు నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం బోధన పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ విద్యార్థి సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ, చైతన్య ఒకేషనల్ కాలేజీలో చదివి విద్యార్థి విద్యార్థులు చాలామంది మోసపోయి చదువుకు దూరం అయ్యారన్నారు. చైతన్య ఒకేషనల్ కళాశాల డైరెక్టర్ కిషన్ విద్యార్థిని విద్యార్థులను అడ్మిషన్ టైం లో స్కాలర్షిప్ తో అడ్మిషన్ చేసుకొని రెండు మూడు నెలల తర్వాత అధిక ఫీజులు ఎగ్జామ్ పేరుతో మరికొన్ని టెస్టు పేర్లతో ఫీజులు కట్టాలని విద్యార్థులను వేధిస్తున్నాడని ఆయన ఆరోపించారు. అంతేకాకు ఒడా డబ్బులు కట్టకపోతే ఎగ్జామ్ టైమ్ లో హాల్ టికెట్ ఇవ్వనని బెదిరించడంతోపాటు ఫీజులు కడితేనే ట్రైనింగ్ కి పంపిస్తానని విద్యార్థులకు భయాందోళనకు గురి చేస్తున్నాడని ఆయన స్పష్టం చేశారు. చైతన్య ఒకేషనల్ కళాశాలలో చాలామంది విద్యార్థులు మోసపోయారని, కళాశాలలో వసతులు, సెక్యూరిటీ లేకపోవడంతో పాటు ర్యాగింగ్ ఎక్కువగా జరిగిన యాజమాన్యం పట్టించుకోరని ఆయన అన్నారు. అందువల్ల చైతన్య ఒకేషనల్ కళాశాలలో అడ్మిషన్ తీసుకునే విద్యార్థిని విద్యార్థులు ముందస్తుగా అగ్రిమెంట్ ఫీజుల వివరాలు రాసుకుని అడ్మిషన్ పొందాలని నాగరాజు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న, సురేష్, మోహన్, గంగ ప్రసాద్, శీను పాల్గొన్నారు.

## ఘనంగ జువ్వడ్ నర్సింగ్ రావు రజిని దంపతుల వివాహ వార్షికోత్స వేడుకలు



**మల్లాపూర్, జూన్07(జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ్ రావు పెళ్లిరోజు వేడుకలు మల్లాపూర్ మండల కేంద్రం లో మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు ఎల్లాల జలపతి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.మండలం లోని అన్ని గ్రామాలనుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాట్ల సోమయ్య మాట్లాడుతూ జువ్వాడి నర్సింగ్ రావు దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ లు, పోతావేణి నారాయణ గౌడ్, ఏ.వెంకటరెడ్డి, డప్పుల పద్మ నర్సయ్య,,ఉప సర్పంచ్, బేతి జగన్ రెడ్డి,గడ్డం సోమరెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత - నర్సయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, నాయకులు పూండ్ర శ్రీనివాస్ రెడ్డి,పూండ్ర లక్ష్మా రెడ్డి,మరిపెల్లి మల్లయ్య,ఆడెపు ఆనంద్ గౌడ్,గున్నలశ్రీనివాస్,సిరిపురం రవీందర్,క్యాతం మల్లారెడ్డి,గడ్డం శ్రీనివాస్ రెడ్డి,ఎర్ర భూమయ్య, మహమ్మద్ రఫీ,పూండ్ర సోమ రెడ్డి, మిట్టపల్లి జీవన్ రెడ్డి, నూతిపెల్లి రాజం,గోపిడి శేఖర్ రెడ్డి,గడ్డం(తిప్పిరెడ్డి)అంజిరెడ్డి,సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సేవలు మరింత బలోపేతానికి నూతన నాయకత్వం

### సిరిసిల్ల ఎండీగా డి.తిరుపతి



**గోదావరిఖని, జనంసాక్షి:** విద్యుత్ రంగంలో విశేష అనుభవం కలిగిన టీజీఎన్‌పీడీసీఎల్ సీని యర్ అధికారి డి.తిరుపతిని సిరిసిల్ల సెస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమిస్తూ సీఎండీ టీజీఎన్ పీడీసీఎల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన తన బాధ్య తలను స్వీకరించారు. టీజీఈఆ ర్‌సీ ఆదేశాల మేరకు 01-04-2026 నుండి సెస్ సిరిసిల్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు టీజీఎన్‌పీడీసీఎల్ ద్వారా అన్ని సేవలు సమర్థవంతంగా అందించనున్నారు.ఈ సేవల నిర్వహణను టీజీఎన్‌పీడీసీఎల్ సిరిసిల్ల ఆపరేషన్ ఎస్‌ఈ టి.వేణుమాధవ్ పర్యవేక్షిస్తున్నారు.ప్రస్తుతం సెస్ లిమిటెడ్ ఉద్యోగుల సహకారంతో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందుతున్న నేపథ్యంలో ఇకపై ఉద్యోగుల పరిపాలనా, సంస్థాగత వ్యవహారాల పర్యవేక్షణను మేనేజింగ్ డైరెక్టర్ డి.తిరుపతి చేపట్టనున్నారు.ఈ సందర్భంగా స్థానిక ఎస్‌ఈ టి.వేణుమాధవ్ పుష్పగుచ్ఛం అందించి డి.తిరుపతికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.నూతన బాధ్యతల్లో ఆయన విజయవంతంగా ముందుకు సాగి సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డీఈలు ఎన్.అంజయ్య,జి.వెంకటరమణ, జిల్లా పరిధికి చెందిన ఏఓలు, ఏడీఈలు, ఏఏఓలు, ఏఈలు,ఇతర అధికారులు పాల్గొని నూతన మేనేజింగ్ డైరెక్టర్‌కు అభినందనలు తెలిపారు. సమర్థ నాయకత్వంతో సిరిసిల్ల సెస్ మరింత పురోగతి సాధిస్తూ వినియోగదారులకు ఉత్తమ విద్యుత్ సేవలను అందిస్తుందనే విశ్వాసాన్ని అధికారులు వ్యక్తం చేశారు.

## ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌పై సింగరేణి జెండా ఎగురవేసిన మోతికుమార్

### అభినందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందనలు



**రామగిరి జనం సాక్షి 01 :**ఖమ్మం జిల్లా వాసి, యువ పర్వతారోహకుడు బి. మోతికుమార్ ఇటీవల నేపాల్‌లోని ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను విజయవంతంగా అధిరోహించి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ని మర్యాదపూర్వకంగా కలిసి ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వద్ద సింగరేణి లోగోను ప్రదర్శించిన సందర్భంగా తీసిన చిత్రపటాన్ని అందజేశారు. సింగరేణి ప్రాంతానికి చెందిన మోతి కుమార్, ఎవరెస్ట్ పర్వత శ్రేణి అడుగుభాగంలోని బేస్ క్యాంప్ వద్ద సింగరేణి సంస్థ జెండాను ప్రదర్శించి సంస్థపై తనకున్న అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు. ఈ అరుదైన విజయంతో సింగరేణి సంస్థకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో ఆయన కృషి ప్రశంసనీయమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మోతికుమార్‌ను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని శిఖరాలను అధిరోహించి తెలంగాణకు, దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. తాను ఇప్పటివరకు అధిరోహించిన వివిధ పర్వతాల గురించి మోతి కుమార్ ఉప ముఖ్యమంత్రి కి వివరించారు. తన తదుపరి లక్ష్యం ప్రపంచంలోనే అత్యున్నత శిఖరమైన మౌంట్ ఎవరెస్ట్‌ను అధిరోహించడం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్, డైరెక్టర్ (పి అండ్ పి) కొప్పుల వెంకటేశ్వర్లు, జిఎం (కో-ఆర్డినేషన్) టి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అగ్నివీర్‌లో ఉద్యోగం సాధించిన చొక్కల్ల రవితేజ కు సన్మానం

**గన్నేరువరం, జూన్ 07 (జనంసాక్షి):**గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన చొక్కల్ల రవితేజ ఇటీవల విడుదల చేసిన అగ్ని వీర్ లో ఉద్యోగం సాధించగ ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన నిరుపేద కుటుంబ యువకుడు అగ్ని వీర్ లో ఉద్యోగం సాధించి భారతదేశానికి సేవ చేయడానికి వెళ్లడం గర్వకారణమని మాజీ జెడ్పిటిసి గూడెల్లి తిరుపతి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గుడెల్లి తిరుపతి, తెలంగాణ సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్, బెజ్జంకి బిఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు రావుల రామకృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ వంగల సత్యనారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ కుసుశీబ అంజయ్య, చింతల రవి, మహమ్మద్ రఫీ, ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాజేందర్ పాల్గొన్నారు.



## రైతు భరోసాపై మౌనం ఎందుకు.. యూరియా కొరతతో రైతన్న ఆవేదన

**సిరికొండ, జూన్ 7 (జనం సాక్షి):**ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని చిన్న వాల్గొట్ బి. ఆర్. యస్ గ్రామ శాఖ అధ్యక్షులు గోగు మోహన్ రెడ్డి తెలిపారు. ఒకవైపు రైతు భరోసా నిధులు అందకపోగా, మరోవైపు యూరియా కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. మృగశిర కార్తె ప్రారంభం కావడంతో రైతులు దుక్కి దున్నడం, నార్లు పోయడం, పంటల సాగుకు సిద్ధమవుతున్న వేళ ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం ఎప్పుడు అందుతుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.గత రబీ సీజన్‌లో రైతు భరోసా పూర్తిస్థాయిలో అందలేదని, కేవలం రెండు ఎకరాల వరకు మాత్రమే నిధులు విడుదల చేశారని ఆయన అన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ప్రారంభమైనప్పటికీ ఈసారి రైతు భరోసా ఎప్పుడు అందిస్తారో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతులు పెట్టుబడుల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, రైతు భరోసా నిధుల విడుదలపై ఇప్పటివరకు రూరల్ ఎమ్మెల్యే, వ్యవసాయ మంత్రి, ముఖ్యమంత్రి ఎలాంటి ప్రకటన చేయకపోవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. రైతు భరోసా ఎప్పుడు విడుదల చేస్తారు, ఎంత మేరకు అందిస్తారనే విషయాలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.మరోవైపు మండలంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, ఎరువుల దుకాణాలకు స్టాక్ వచ్చినా సామాన్య రైతులకు అందడం లేదని ఆరోపించారు. యూరియా స్టాక్ అందుబాటులోకి వచ్చిన కొద్ది నిమిషాల్లోనే పూర్తిగా అయిపోవడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. పలుకుబడి ఉన్న నాయకులు, వారి అనుచరులకే ముందుగా సమాచారం చేరి యూరియా బస్తాలను సేకరిస్తుండగా, సాధారణ రైతులు ఖాళీ చేతులతో వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొందని విమర్శి ంచారు.



యూరియా పంపిణీలో పారదర్శకత పాటించి అర్హులైన రైతులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా ఎన్నికల సమయంలో వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ ప్రస్తుతం రైతులకు కేవలం 11 గంటల 10 నిమిషాల పాటు మాత్రమే విద్యుత్ సరఫరా అందుతోందని గోగు మోహన్ రెడ్డి తెలిపారు. ఉదయం 5:50 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు మాత్రమే కరెంట్ ఇస్తున్నారని, మిగిలిన విద్యుత్ సరఫరాను ఎప్పటి నుంచి అందిస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.ఖరీఫ్ సాగు పనులు వేగంగా కొనసాగుతున్న ఈ సమయంలో రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయడంతో పాటు యూరియా కొరతను నివారించి, వాగ్దానం చేసిన మేరకు వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని చిన్న వాల్గొట్ బి. ఆర్. యస్ గ్రామ శాఖ అధ్యక్షులు గోగు మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.


## ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం: సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

**కరీంనగర్ టౌన్, జూన్ 7: ( జనం సాక్షి)**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలను కొనసాగిస్తూనే, ఉచిత విద్య, వైద్యం కోసం దీర్ఘకాలిక పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవన్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల ప్రయోజనాలకు విరుద్ధంగా విధానాలు అమలు చేస్తోందని ఆయన విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ ఆర్థిక అసమానతలను పెంచుతోందని ఆరోపించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఉద్యోగాల కల్పనలో విఫలమైందని, లక్షలాది మంది యువత ఉపాధి కోసం వివిధ రంగాల్లో తాత్కాలిక ఉద్యోగాలకు పరిమితమవుతున్నారని అన్నారు.దేశంలో మహిళలపై హత్యలు, అత్యాచారాలు, లైంగిక వేధింపుల ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా రైతులను ఇబ్బందులకు గురిచేసే నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్ల ద్వారా కార్మిక హక్కులను బలహీనపరుస్తూ కార్పొరేట్ సంస్థలకు అనుకూల వాతావరణం కల్పించారని ఆరోపించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి, రైతు భరోసా, కూలి భరోసా, కౌలు భరోసా నిధులను విడుదల చేయాలని కోరారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూనే ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జూన్, జూలై, ఆగస్టు నెలల్లో గ్రామాలు, బస్తీల్లో పర్యటించి ప్రజా సమస్యలను అధ్యయనం చేస్తామని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేస్తూ అవసరమైతే ఆందోళనలు చేపడతామని వెల్లడించారు.పట్టణ ప్రాంతాలకు ఉపాధి హామీ చట్టాన్ని విస్తరిస్తామని తెలంగాణ



ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరించిందని ఆయన విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం హామీని నెరవేర్చలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి అమలు చేయలేదని అన్నారు.జిల్లాలో వేలాది మంది పేదలకు ఇళ్లు లేవని, వారికి ఇళ్ల స్థలాలు కేటాయించి గృహనిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ కూడా పెరిగిపోయిందని, వైద్య సేవలపై నియంత్రణ లేకపోవడంతో రోగులు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు.తెల్ల రేషన్ కార్డుదారులకు 14 రకాల నిత్యావసర వస్తువులు అందించాలని, ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో ఎరువుల కొరతను నివారించాలని ప్రభుత్వాన్ని కోరారు. యూరియా బుకింగ్ యాప్ సరిగా పనిచేయడం లేదని, డీఏపీ ఎరువులు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాంప్లెక్స్ ఎరువుల ధరల పెరుగుదల రైతులపై అదనపు భారం మోపుతోందని పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న పంటకు సంబంధించిన బకాయిలను రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు.రాబోయే మూడు నెలల కాలంలో గ్రామస్థాయిలో ప్రజా సమస్యలను అధ్యయనం చేస్తూ, వాటి పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు నిర్వహిస్తామని వాసుదేవరెడ్డి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుడికందుల సత్యం, జి. బీమా సాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు డి. నరేష్ పటేల్, జిల్లా నాయకులు పుల్లెల మల్లయ్య, పున్నం రవి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## పిట్లం మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షురాలుగా రూప దస్తాగౌడ్



**పిట్లం జూన్ 07(జనం సాక్షి)**పిట్లం మండల సర్పంచ్ ఫోరంలో అధ్యక్షురా లుగా రూప దస్త గౌడ్ ఎన్నికయ్యారు. మండల వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు ప్రత్యేకంగా సమావేశమై సర్పంచ్ లు పోరం అధ్యక్షురాలు తో పాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఉపాధ్యక్షురాలుగా కళావతి గంగారాం, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్, కోశాధికారిగా విఠల్, జాయింట్ సెక్రెటరీగా రాజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు రూప దస్తా గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల సర్పంచ్ పోరం బాధ్యతలను అప్పగించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తానని ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గ్రామాల అభివృద్ధికి వినియోగించుకునే విధంగా కృషి చేస్తానని తెలిపారు. సర్పంచ్ లకు ఎటువంటి సమస్యలు వచ్చిన ముందుండి పోరాడుతానని హామీ ఇచ్చారు. మండల సర్పంచ్ ల ఫోరం బాధ్యతలు అప్పగించడంతో తనపై మరింత బాధ్యత పెరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవి సీనియర్ నాయకులు అడ్వకేట్ రామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.